





అమ్మవారి సన్నిధిలో భక్తుల రద్దీ

భక్తులతో కిక్కిరిసిన గోదావరి స్నానఘట్టం

భక్తులతో పోటెత్తిన గోదావరి తీరం

బాసర, మే 30 (ఆంధ్రజ్యోతి) : బాసర పుణ్యక్షేత్రంలో గోదావరి నదీ తీరం శుక్రవారం భక్తులతో పోటెత్తింది. సరస్వతీ అమ్మవారి దర్శనానికి ముందు గోదావరి నదికి పూజలు నిర్వహించే భక్తులతో దినమంతా నది తీరం భక్తులతో సందడిగా కనిపించింది. నదిలో స్నానాలు ఆచరించి పిండి వంటలతో గోదారమ్మకు మొక్కులు చెల్లించారు. నది ఒడ్డున గల శివాలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయంలోని రెండు అక్షర శ్రీకార మండపాల్లో 905 మంది చిన్నారులు అక్షర శ్రీకార పూజలు జరుపుకున్నారు. కేవలం పూజా టికెట్ల విక్రయం ద్వారానే శుక్రవారం అమ్మవారి ఆలయానికి రూ. 10 లక్షల వరకు ఆదాయం సమకూరింది.

పంటల మద్దతు ధరపై పట్టణంలో బీజేపీ సంబరాలు

- ప్రధాని మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



ప్రధాని మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

నిర్మల్ రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి) : పంటల మద్దతు ధరపై పట్టణంలో బీజేపీ సంబరాలు చేసుకున్నట్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యన్నగారి భూమయ్య తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశంలో ప్రధానంగా పండించే 14 రకాల పంటలకు ఎంఎస్పీ కనీస మద్దతు ధర పెంచి రైతుల ముఖాల్లో సంతోషాన్ని తెచ్చిన ప్రధాని మోదీ రైతన్న సంక్షేమం కోసం చేస్తున్న మంచికై శుక్రవారం పట్టణంలో నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మెరాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, సీనియర్ నాయకులు భూపతిరెడ్డి, ఆడెపు సుధాకర్, పట్టణ ప్రధాన కార్యదర్శి కొండాజి శ్రావణ్, ఉపాధ్యక్షులు రాజు, రావులవారి విఠల్, గాంధీ విజయ్, బీజేవైఎం స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పోలాస భరత్, నాయకులు సాత్విక్, గంజి రాజు, గురజాల రాజు, సుంకరి ఆనంద్, నాగేందర్, మారుతి, ఆనంద్, ముఖ్య నాయకులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నిర్మల్ కల్చరల్, మే 30 (ఆంధ్రజ్యోతి) : లోకమాత రాణి అహల్యాబాయి హోల్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కిడ్స్ స్క్వేర్ అకాడమీ డే కేర్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మహిళా బీజేపీ కన్వీనర్ అలివేలు మంగ మాట్లాడుతూ... తరతరాలకు అహల్యాబాయి స్ఫూర్తి దాయకమన్నారు. గొప్ప దేశభక్తురాలని కొనియాడారు.

సంపూర్ణ అక్షరాస్యత దిశగా అడుగులు



- పల్లెల్లో విద్యా సేవకులు
- రిటైర్డ్ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలకు అవకాశం
- న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమంతో నిరక్షరాస్యత నిర్మూలన
- జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద బాసర
- గ్రామ, మండల కమిటీల ఏర్పాటు

నిర్మల్, మే 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను పూర్తిస్థాయి అక్షరాస్యత జిల్లాగా మార్చేందుకు సంబంధితశాఖ అధికారులు పకడ్బందీ ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగానే సంపూర్ణ అక్షరాస్యత సాధన పేరిట ఓ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం (ఎన్ఎల్ఐపీ) అనుగుణంగా ఇకనుండి అందరికీ అక్షరాలు వచ్చేట్లు చేయడం, జిల్లాలో నిర్లక్షరాస్యులు లేకుండా చేయడమే లక్ష్యంగా పెట్టుకోబోతున్నారు. ప్రతీ ఒక్కరికి చదవడం, రాయడం రావాలని ధ్యేయంగా పెట్టుకుంటున్నారు. దీనికోసం ఉమ్మడి జిల్లాలోని నలుగురు అడిషనల్ కలెక్టర్లు, డీఈవోలకు ఈ కార్యక్రమ అమలు బాధ్యత అప్పజెప్పారు. మండలాల వారీగా నిర్లక్షరాస్యులను ఇక గుర్తించబోతున్నారు. గ్రామ మహిళా సంఘాలకు నిరక్షరాస్యుల గుర్తింపు బాధ్యతను అప్పజెప్పారు. దీంతో పాటు ఈ కార్యక్రమ అమలులో కూడా మహిళా సంఘాలకు పెద్దపీట వేస్తున్నారు. కాగా మహిళా సంఘాలు తమ గ్రామ పరిధిలోని నిరక్షరాస్యులను గుర్తించేందుకు కోసం ఇంటి సర్వే కూడా చేపట్టనున్నారు. ఇలా మహిళా సంఘాలు సర్వే నిర్వహించడమే కాకుండా నిరక్షరాస్యుల జాబితాను రూపొందించి సంబంధిత అధికారులకు అందించనున్నారు. అయితే ఈ ప్రోగ్రాం అమలును దశలవారీగా చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే మొదట చదువుల తల్లి సరస్వతి దేవికి నిలయమైన బాసర మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. అలాగే మొదటి విడతలో నిరక్షరాస్య మహిళ లకు ప్రాధాన్యత ఇవ్వబోతున్నారు.

మొదటి పైలెట్ ప్రాజెక్టుగా బాసర మండలం

చదువుల తల్లికి నిలయమైన బాసర మండలాన్ని ఈ కార్యక్రమం కోసం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. మొదటి ఈ మండలంలోని మహిళా నిరక్షరాస్యులు అందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నారు. ఇప్పటికే ఎన్ఐఎల్‌పీ అధికారులు మండలాల వారీగా నిరక్షరాస్యులందరినీ గుర్తించారు. వీరి లెక్క ప్రకారం జిల్లాలో మొదటి 20,866 మందిని నిరక్షరాస్యులుగా గుర్తించారు. వీరిలో 8,260 మంది పురుషులు, 12,060 మంది మహిళలు ఉన్నారు. బాసర మండలంలో మొదట 550 మంది నిరక్షరాస్య మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నారు. ఈ మండలంలో 100 అక్షరాస్యత సాధించేందుకు నిర్దేశిత గడువును విధించారు. ఈ గడువులోగా లక్ష్యం పూర్తి కాగానే ఇక జిల్లా అంతటా అందరికీ అక్షరాలు ఎన్ఐఎల్‌పీ కార్యక్రమాన్ని వేగంగా పూర్తి చేయనున్నారు.

స్వచ్ఛంద విద్యా సేవకులు

గ్రామంలో అందరినీ అక్షరాస్యులుగా చేసేందుకు అక్కడి రిటైర్డ్ ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోవాలని నిర్ణయించారు. దీనికోసం గాను వారిని విద్యాసేవకులుగా గుర్తించనున్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయులతో పాటు ఆ గ్రామంలో చదువుతున్న యువత, ఉద్యోగులు సైతం విద్యా సేవకులుగా నిరక్షరాస్యత నిర్మూలనకు తమవంతు సహకారం అందించాలని కూడా అధికారులు కోరుతున్నారు. వీరంతా స్వచ్ఛందంగానే నిరక్షరాస్యుల కోసం విద్యాబోధన చేయాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనే విద్యార్థులకు, యువకులకు ఏఐసీటీఈ, అలాగే ఎన్‌సీటీఈ ద్వారా విద్యా క్రెడిట్లను కూడా ప్రధానం చేయనున్నారు. మొత్తానికి తమ గ్రామాన్ని సంపూర్ణ అక్షరాస్యత గ్రామంగా తీర్చిదిద్దడంతో ప్రతి ఒక్కరూ తమవంతు భాగస్వామ్యం పంచుకోవాలని అధికారులు, గ్రామస్థులను కోరుతున్నారు.

గ్రామ, మండల స్థాయి కమిటీలు

జిల్లాలోని ప్రతి గ్రామం సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు కోసం గ్రామ, మండల స్థాయిలో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. గ్రామస్థాయిలో ఏర్పాటయ్యే కమిటీలో ఇక్కడి పాఠశాలల హెడ్ మాస్టర్లు, టీచర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యత వహించనున్నారు. అలాగే మండల స్థాయి కమిటీలో సంబంధిత ఎంపీడీవో, ఎంఈవోతో పాటు ఇతర అధికారులతో ఈ సమన్వయ కమిటీ ఏర్పాటు చేయనున్నారు. క్షేత్రస్థాయిలో మహిళా సంఘాలు అందించే నివేదిక ఆధారంగా ఈ కమిటీలు బడి మానేసిన వారందరినీ గుర్తించి ఓపెన్ స్కూల్స్‌లలో చేర్చనున్నారు. అలాగే ఈ కమిటీ సభ్యులు ప్రతి వారం తమ పరిధిలో జరుగుతున్న అక్షరాస్యత కార్యక్రమాల ప్రగతిపై రివ్యూ కూడా చేయనున్నారు. ఇక జిల్లాలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్ది సంపూర్ణ అక్షరాస్యత సాధించే దిశగా అధికారులు శ్రమిస్తున్నారు.





సీఎం, మంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

దస్తురాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ నియోజకవర్గంలోని ఉట్నూర్ మండలంలో 200 కోట్ల నిధులతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరుపై హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జు పటేల్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ ఛైర్మన్ రామడుగు శైలజ రమేష్ రావు, మండల యూత్ అధ్యక్షులు గుండా నరేష్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి బాధ్యతలు చేపట్టినప్పటి నుండి విద్యారంగానికి పెద్దపీట వేస్తుందన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ పేద విద్యార్థులకు ఒకే దగ్గర బోధించే విధంగా ఇంటిగ్రేటెడ్‌స్కూళ్లను ఏర్పాటు చేయడం కాంగ్రెస్ పని తనానికి నిదర్శనమన్నారు. పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కి పునాది ఈ పాఠశాల అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీపీ కిషన్, ఏఎంసీ డైరెక్టర్ పుల్యా నాయక్, నిమ్మతోట శివయ్య, సురేందర్, రంజిత్ కుమార్, ప్రేమ్‌సాగర్, స్వామి, రాజేశం, వెంకన్న, కొమురయ్య, ప్రసాద్, కిరణ్, గోపి, తిరుపతి, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

సత్ఫలితాలిస్తున్న భరోసా కేంద్రాలు

ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్ కల్చరల్, మే 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భరోసా కేంద్రాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. శుక్రవారం ఎల్లపల్లి గ్రామంలోని ఓ జంట చిన్న మనస్పర్థలతో దూరం కాగా వారికి భరోసా కేంద్రం పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించి వారిని ఒక్కటి చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... క్షణికావేశంలో దాంపత్య జీవితానికి దూరమైన ఎన్నో జంటలను భరోసా కేంద్రం ద్వారా అనుభవజ్ఞులైన వారితో కౌన్సిలింగ్ నిర్వహించి ఒక్కటి చేస్తున్నారని తెలిపారు. షీ టీమ్స్, భరోసా కేంద్రం సిబ్బంది చేస్తున్న కృషితో ఎన్నో జంటలు కలిసి సుఖ సంతోషాలతో జీవిస్తున్నారని పేర్కొన్నారు. షీ టీం, భరోసా కేంద్ర ఇన్‌చార్జి అధికారి ఎస్సై నర్సయ్య, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. పోలీసు శాఖ ప్రజలకు ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు.

లక్ష్మణచాందలో భారీ వర్షం



లక్ష్మణచాంద మండల కేంద్రంలో కురుస్తున్న వర్షం

లక్ష్మణచాంద, మే 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. కనకాపూర్, వడ్యాల్, బాబాపూర్, రాచాపూర్, మునిపెల్లి, పార్‌పెల్లి, లక్ష్మణచాంద, చామన్‌పెల్లి, చింతల్‌చందా, తిరుపెల్లి, పొట్టపెల్లి, తదితర గ్రామాల్లో వర్షానికి ముందు వీచిన ఈదురు గాలులకు స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. అక్కడక్కడ చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. రోడ్లపై ఆరబెట్టిన వరి ధాన్యం, నింపి ఉంచిన ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. పంట కల్లాల్లో ఉన్న నువ్వు కుప్పలు తడిసిపోయాయి.

ఇంటర్‌లో ప్రవేశానికి జాబితా ప్రదర్శన

కుంటాల, మే, 30 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల ఆదర్శ మోడల్ పాఠశాలలో ఇంటర్ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరంలో 2025- 2026 సంవత్సరానికి గాను విద్యార్థుల ప్రవేశ జాబితాను పాఠశాలలో ప్రదర్శించడం జరిగిందని ప్రిన్సిపల్ నవీన్ తెలిపారు. జాబితాలో పేర్లు ఉన్న విద్యార్థులు జూన్ 2, 3, 4 తేదిల్లో సరైన ధ్రువపత్రాలతో హాజరు కావాలని ఆయన సూచించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠినచర్యలు : కలెక్టర్



రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నకిలీ విత్తనాలు, ఎరువులు, మందుల విక్రయాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అభిలాష అభినవ్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న అరుణ్ ఏజెన్సీ ఫర్టిలైజర్ దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలోని విత్తనాలు, పురుగు మందుల ప్యాకింగ్, లేబుళ్లు, అమ్మకాల రిజిస్టర్లు, నిల్వల వివరాలు కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... నకిలీ విత్తనాల కారణంగా రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిషేధించిన మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని, నిబంధనలను అతిక్రమించిన వారి మీద చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. అధికారులు రెగ్యులర్‌గా దుకాణాలపై తనిఖీలు నిర్వహించాలని సూచించారు. నకిలీ విత్తనాల సరఫరా, అమ్మకాలపై కఠినంగా చర్యలు తీసుకుని రైతుల ప్రయోజనాలను కాపాడాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ అధికారి రాజశేఖర్, తహసీల్దార్ రాజు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఏకరూప దుస్తులు నాణ్యతగా తయారు చేయాలి



యూనిఫాం తయారీ కేంద్రంలో అధికారులతో కలెక్టర్

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందించే యూనిఫామ్స్ (ఏకరూప దుస్తులు) నాణ్యంగా ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని ఈద్గాం, మంజులాపూర్‌లో ఏర్పాటు చేసిన యూనిఫాం తయారీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుస్తుల కుట్టు నాణ్యతను, తయారీ విధానాన్ని సమీక్షించిన కలెక్టర్ విద్యార్థులకు ఇవ్వబోయే దుస్తులు ఖచ్చితంగా కొలతలకు తగినట్లుగా ఉండాలన్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యే లోపు విద్యార్థులకు యూనిఫామ్స్ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దుస్తుల తయారీదారులకు పలు సూచనలు చేసిన కలెక్టర్ నాణ్యత విషయంలో ఏమాత్రం తేడా ఉండకూడదన్నారు. ఈ పరిశీలనలో డీఆర్‌డీవో విజయలక్ష్మి, మెప్మా పీడీ సుభాష్, విద్యాశాఖ అధికారులు లింబాద్రి, ప్రవీణ్, తహసీల్దార్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ అండ్ బి ఈఈ అశోక్ కుమార్ సేవలు మరువలేనివి

రోడ్లు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి. అశోక్ కుమార్ సేవలు జిల్లాలో గుర్తుండిపోయేలా ఉన్నాయని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన పదవీ విరమణ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన పంచాయతీరాజ్ శాఖ ఈఈ శంకరయ్యను కలెక్టర్, అదనపు కలెక్టర్, ఇతర అధికారులు శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, జడ్పీ సీఈవో గోవింద్, సీపీవో జీవరత్నం, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై తక్షణ చర్యలు

ముథోల్, మే 30 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ మండలం బోరిగాం గ్రామంలోని సర్వే నెంబర్ 249లో ఇటీవల కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆక్రమించేందుకు యత్నించిన విషయం వెలుగులోకి రావటంతో ఈ సమాచారాన్ని అందుకున్న రెవెన్యూ శాఖ అధికారులు తక్షణమే స్పందించి, సంబంధిత భూమి హద్దులను గుర్తించటం జరిగిందని కలెక్టర్ అభిలాష అభినవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఆక్రమణలను తొలగిస్తూ, అవసరమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. బోరిగాం ఘటన నేపథ్యంలో రెవెన్యూ, ల్యాండ్ సర్వే విభాగాలకు చెందిన అధికారులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని జిల్లా యంత్రాంగం నియమించిందని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం ఆ కమిటీ విచారణ కొనసాగిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇటువంటి అక్రమాలు చోటుచేసుకోకుండా నివారించేలా జిల్లా యంత్రాంగం పటిష్టమైన చర్యలు చేపడుతుందని తెలిపారు. అయితే ఈ వ్యవహారంలో కొంతమంది వ్యక్తులు శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా అసత్య ప్రచారాలు, పుకార్లు వ్యాప్తి చేయడానికి యత్నిస్తున్నట్లు గుర్తించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఎవరు అసత్య ప్రచారాలు, పుకార్లను నమ్మవద్దని కలెక్టర్ కోరారు. బోరిగాం గ్రామ ప్రజలందరికీ జిల్లా యంత్రాంగం పూర్తి అండగా నిలుస్తోందని కలెక్టర్ తెలిపారు. ఎక్కడ ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా ఉండేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ప్రకటనలో స్పష్టంచేశారు. జిల్లాలో బుద్ధ విహార్ ఏర్పాటుకై సంబంధిత స్థల సేకరణ కొరకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు.

ముథోల్‌లో దళిత సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో



ముథోల్‌లో రాస్తారోకో చేస్తున్న దృశ్యం



ఆందోళన కారులకు నచ్చజెప్పుతున్న ఎస్పీ



ఆందోళన కారులతో మాట్లాడుతున్న విఠల్‌రెడ్డి

ముథోల్, మే 30 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో శుక్రవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రాస్తారోకో సుమారు నాలుగు గంటల వరకు కొనసాగింది. చలో బోరిగాం కార్యక్రమంలో భాగంగా వివిధ దళిత సంఘాల నాయకులు ముథోల్‌లోని బుద్ధవిహార్ వద్ద సమావేశమైన తర్వాత ఛలో బోరిగాం కార్యక్రమంలో భాగంగా ముథోల్ నుంచి బోరిగాంలో విగ్రహం తొలగించిన స్థలంలోనే బుద్ధ విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్‌తో బయలుదేరారు. అయితే ముథోల్ పోలీసుస్టేషన్ వద్ద భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్, ఉపేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వారిని బోరిగాం వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో ఆందోళనకారులు మండల కేంద్రమైన ముథోల్‌లోని భైంసా, బాసర రహదారిపై రాస్తారోకోకు దిగారు. సుమారు నాలుగు గంటల వరకు ఈ రాస్తారోకోను చేపట్టారు. తమకు బుద్ధవిగ్రహం తొలగించిన చోటనే బుద్ధుని విగ్రహం ఏర్పాటు చేయాలని, దాడి చేసిన వారిని కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్‌తో రాస్తారోకోకు దిగారు. అయితే ఆందోళన కారులను సముదాయించేందుకు భైంసా తహసీల్దార్ ప్రవీణ్ ముథోల్‌కు చేరుకొని తమ డిమాండ్లను జిల్లా కలెక్టర్‌కు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పినప్పటికీ ఆందోళనకారులు ఒప్పుకోలేదు. వెంటనే ఆర్డీవో, కలెక్టర్ ముథోల్‌కు వచ్చి ఖచ్చితమైన హామీ ఇవ్వాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. వెంటనే తొలగించిన స్థలంలో బుద్ధ విగ్రహం ఏర్పాటు చేయాలని పట్టుబట్టారు. దీంతో బోరిగాంలో ఉన్న ఎస్పీ జానకి షర్మిల ముథోల్‌కు చేరుకొని ఆందోళన కారులను సముదాయించారు. తమ డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. అయితే కలెక్టర్ రావాలని పట్టుబట్టడంతో కలెక్టర్‌తో ఎస్పీ ఫోన్‌లో మాట్లాడించారు. అయిన ఆందోళన విరమించలేదు. ఎస్పీ సంయమనంతో వ్యవహరించి బోరిగాం వైపు ఆందోళనకారులు వెళ్లకుండా గట్టి బందోబస్తు నిర్వహించేటట్లు చర్యలు తీసుకున్నారు. అలాగే ఆర్డీవో హుటాహుటిన ముథోల్‌కు చేరుకొని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ వెంటనే బుద్ధుని విగ్రహం ఏర్పాటు చేయాలని పట్టుబట్టారు. అయితే ఈ విషయం తెలుసుకున్న ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ముథోల్‌కు వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. మంత్రి దృష్టికి, ప్రభుత్వం దృష్టికి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. విగ్రహం ఏర్పాటుకు 10వ తేదీ వరకు స్థలం కేటాయించేలా అలాగే కాంస్య విగ్రహం ఏర్పాటు చేసేలా చూస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు. రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలను వెంటనే పోలీసులు క్లియర్ చేయించారు.

బీసీ గురుకులంలో డిగ్రీ ప్రవేశాలు



కళాశాల ప్రిన్సిపాల్

నిర్మల్ రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా జ్యోతి బాపూలే (పురుషుల) డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి మహాత్మాజ్యోతి బాపూలే (పురుషుల) గురుకుల చించోలి ఎక్స్ రోడ్ వద్దనున్న డిగ్రీ కళాశాల ప్రవేశం కోసం అడ్మిషన్ల ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభమైందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బట్టు వినయ్‌కుమార్ పత్రిక ప్రకటనలో తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... ఇంటర్మీడియట్ మార్కులను బట్టి అర్హత పొందిన మొదటి జాబితా విద్యార్థులు మే 30వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు అడ్మిషన్ ప్రక్రియ నడుస్తుందని, కళాశాలలోని వివిధ కోర్సులలో విద్యార్థులు అప్లై చేసుకోవాలని, విద్యార్థులకు ఉచిత భోజనం, వసతితో పాటు మూడు జతల యూనిఫాం, టెక్స్ట్‌బుక్స్, నోట్ పుస్తకాలు, ఒక జత షూస్, ట్రాక్ సూట్స్ బెడ్‌షీట్స్ అందజేస్తామని తెలిపారు. సమాచారం కోసం 9505520097, 81066 63222 నెంబర్లకు సంప్రదించాలన్నారు.



ఇచ్చోడలో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్

ప్రారంభం అద్భుతం.. అమలులో నిర్లక్ష్యం

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఇచ్చోడ, మే 30(ఆంధ్రజ్యోతి): కల్యాణలక్ష్మి పథకం బీఆర్ఎస్ హయాంలో ప్రారంభం ఒక అద్భుతమని.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పథకం అమలు నిర్లక్ష్యమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకంలో భాగంగా లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని ఇచ్చిన హామీ ఇప్పటివరకు నెరవేరలేదన్నారు. ఇచ్చోడలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీకి రావాలని కోరితే ఈసారైనా తులం బంగారం వచ్చిందేమోనని అనుకున్నామని, ఈసారి కూడా నిరాశే మిగిలిందన్నారు. అనంతరం స్థానిక నాయకుతో కలిసి ఇచ్చోడలోని ఓ హోటలో స్థానికులతో కలిసి తేనీటి విందులో పాల్గొన్నారు. ఇందులో బీఆర్ఎస్ కన్వీనర్ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, నాయకులు దెవెందర్‌రెడ్డి, సుభాష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

● యూపీ దాబాను ప్రారంభించిన ఎమ్మెల్యే

నేరడిగొండ: మండలంలోని కొరటికల్ హైవే వద్ద సుధాకర్ నూతనంగా ఏర్పాటు చేసిన యూపీ దాబాను శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ధాబా యజమాని ఎమ్మెల్యేను శాలువతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాధవ్ మాట్లాడుతూ దాబాకు వచ్చిన వారికి నాణ్యమైన ఆహారం అందజేయాలని, చెడు వ్యసనాలకు చోటు కల్పించొద్దని సూచనలు చేశారు. అనంతరం పాషా తండా గ్రామానికి చెందిన పాలియార్ కపూర్ చంద్ ఇంటిని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ సందర్శించారు. ఎమ్మెల్యే వెంట మండల నాయకులు, రాథోడ్ సజన్, రవీందర్ రెడ్డి. నానక్ సింగ్, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

● భక్తిమార్గంలో మానసిక ప్రశాంతత

నేరడిగొండ: భక్తి మార్గంలో మానసిక ప్రశాంతత లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని వడూర్ గ్రామంలో గల ముత్యాల పోచమ్మ ఆలయంలో శుక్రవారం నిర్వహించిన పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాధవ్ మాట్లాడుతూ భక్తి మార్గంలో మానసిక ప్రశాంతత ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

సంవిధాన్ బచావో ప్రోగ్రామ్ రాష్ట్ర కమిటీలో ఆత్రం సుగుణకు చోటు

ఉట్నూర్, మే 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణను పార్టీ శ్రేణులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. సంవిధాన్ బచావో ప్రోగ్రామ్ రాష్ట్ర కమిటీలో ఆమెకు చోటు లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి సుగుణకు పూలమొక్కలను అందించి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ పార్టీ నాకు ఇచ్చిన బాధ్యతలను వమ్ము చేయకుండా సంవిధాన్ బచావో ప్రోగ్రామ్‌ని ప్రజల్లోకి తీసుకు వెళ్లడానికి కృషి చేస్తానన్నారు. పార్టీ శ్రేణులు కూడా కష్టపడి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని సూచించారు.

సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యం

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

సిరికొండ రూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదోడి సొంతింటి కలలను నెరవేర్చేందుకు ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శుక్రవారం సిరికొండ మండలంలోని పోచంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేసి, లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. అర్హులైన ప్రతి పేద వాడికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సబ్బండ వర్గాల ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదల కోసం నూతనంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నేరుగా లబ్ధిదారులకు ఇంటి పత్రం అందజేసి వెంటనే పనులు ప్రారంభించిన అధికారులు శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత మంజూరైన లబ్ధిదారుల లిస్టును ఎంపీడీవో చంద్రశేఖర్ గృహ నిర్మాణ శాఖ ఏఈ నసీర్, ఐకెపి ఏపీఎం చంద్రశేఖర్ నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకం ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేస్తూ పనులను ప్రారంభించడం జరిగిందని, మొదటి విడత కింద 69 ఇళ్లు మంజూరు అయ్యాయని అన్నారు. రెండో విడత కింద మండలం మొత్తం 415 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. మంజూరు పత్రాలను అందుకున్న లబ్ధిదారులు వెంటనే



తలమడుగులో లబ్ధిదారులకు పత్రాలను అందజేస్తున్న అధికారులు

పనులు ప్రారంభించాలని, ఇసుకకు సంబంధించిన టోకెన్లను తహసీల్దార్ కార్యాలయంలో తీసుకోవచ్చని అన్నారు. లబ్ధిదారులు ఆర్థికంగా ఇబ్బందులు ఉంటే స్వయం సహాయక సంఘం ద్వారా లబ్ధి పొందవచ్చని తెలిపారు. ఇళ్ల మంజూరు కోసం దళారులను నమ్మి ఎవరు మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో వినోద్, పంచాయతీ కార్యదర్శి గజానంద్ సుజాత, మాజీ ఎంపిటిసి వెంకన్న, విలాస్ యాదవ్, రవీందర్, పొచ్చన్న, ప్రశాంత్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: మండలంలోని తేజాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఎంపీడీవో రాజ్‌వీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణం పనులను లబ్ధిదారులు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ గణేష్, గ్రామ పంచాయతీ సెక్రెటరీ రాజు రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పంటలకు ధరల పెంపు పట్ల రైతుల హర్షం

● బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం

ఉట్నూర్, మే 30(ఆంధ్రజ్యోతి): నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 2025 ఖరీఫ్ సీజన్‌కు 14 ప్రధాన పంటలకు కనీస మద్దతు ధరలు భారీగా పెంచడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఈ మేరకు బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతుల పంటలకు ముందే గిట్టుబాటు ధరలు ప్రకటించిందని అన్నారు. రైతన్నకు మద్దతుగా బీజేపీ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. ఇందులో మండల అధ్యక్షుడు బింగి వెంకటేశ్, రాష్ట్ర మహిళా కౌన్సిల్ మెంబర్ జాదవ్ సుమన్‌బాయి, జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, మాజీ జడ్పీటీసీ సాడిగే గంగన్న, మాజీ వైస్ ఎంపీపీ బాలాజి, మాజీ ఎంపీటీసీ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

● ఉట్నూర్ మండల బీజేపీ కార్యవర్గం

ఉట్నూర్: బీజేపీ మండల అధ్యక్షుడిగా బింగి వెంకటేశ్‌తో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ తెలిపారు. ఉపాధ్యక్షుడిగా కాలేరి గంగాధర్, గవాలే అమర్నాథ్, బామ్నే అర్జున్ సింగ్, ఓలెపు భుజంగరావు, ప్రధాన కార్యదర్శులుగా సల్గారే రవీందర్, కాల్వ రవి, కార్యదర్శిగా శ్రీమంగల్ రాహుల్‌లను ఎన్నుకోవడం జరిగిందన్నారు.

ఉపాధి హామీ కూలీల ఆందోళన

ఆదిలాబాద్ అర్బన్, మే 30(ఆంధ్రజ్యోతి): పెండింగ్ కూలి వేతనాలతో పాటు ఇతర సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు ఆందోళనకు దిగారు. ఈ మేరకు శుక్రవారం వారు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. వీరికి ఆదివాసీ గిరిజన సంఘం మద్దతుగా నిలిచింది. ప్రభుత్వ తీరుకు నిరసనగా నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు లంక రాఘవులు మాట్లాడారు.

ఘనంగా టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ఉట్నూర్, మే 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఈ సందర్భంగా సంఘం జెండాను టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్సకోల జ్ఞానేశ్వర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, ఉపాధ్యాయుల, విద్యారంగ సంక్షేమానికి టీపీటీఎఫ్ నిరంతర కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వాలు, ప్రజల, ఉద్యోగుల సమస్యలను మానవీయ కోణంలో చూడాలన్నారు. రాజ్యాంగ విలువలను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఇందులో రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగరావు, రాష్ట్ర కౌన్సిలర్ వెడ్మ శ్యామ్‌రావ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్రం బలిరామ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'సంఘాలతో రైతుల ఆర్థిక అభివృద్ధి'

తలమడుగు, మే 30(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సహకార సంఘాలతోనే రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు అని, ప్రతిఒక్కరూ నగదు రహిత ఆర్థిక లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలని నాబార్డు డీడీఎం రావుఫ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ప్రాథమిక సహకార సంఘం సుంకిడి శాఖలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ కోపరేటివ్ సందర్భంగా తలమడుగు ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు సహకార సంఘం అక్షరాస్యతపై అవగాహనను కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాబార్డు డీడీఎం రావుఫ్, జిల్లా సహకార బ్యాంకు జనరల్ మేనేజర్ సూర్య ప్రకాష్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాబార్డు డీడీఎం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సహకార సంఘాల బలోపేతానికి కృషి చేస్తుందని, ఈ సంవత్సరం సహకార సంఘాల సంవత్సరంగా ప్రకటించడం జరిగిందన్నారు. అందులో భాగంగానే రైతులకు సహకార సంఘాల అక్షరాస్యత శిబిరాలను ఏర్పాటు చేస్తూ అవగాహన కల్పించడం జరుగుతుందని, సహకార సంఘాల ద్వారా రైతులు ఎన్నో విధాలుగా లబ్ధి పొందవచ్చని, రుణాలు సకాలంలో చెల్లిస్తూ రైతులు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. సంఘం ఉపాధ్యక్షుడు నల్ల పద్మాకర్ రెడ్డి, సీఈవో మోతి శ్రీనివాస్, సుంకిడి ఎడిసిసి బ్యాంకు మేనేజర్ రవి యాదవ్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

తొలకరికి ముందే సాగు సందడి!

(3వ పేజీ తరువాయి...)

అధికంగా 4లక్షల 40వేల ఎకరాలలో పత్తి సాగయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ప్రతియేటా నకిలీ విత్తనాలతో అన్నదాతలు నష్టపోతున్నారు. అలాగే అంతర్‌పంటగా కంది పంటను సాగు చేస్తు అధిక లాభాలను పొందుతున్నారు. పెట్టుబడి ఖర్చులు పెరిగి పోతున్నాయన్న ఉద్దేశంతో కొంత మంది రైతులు ప్రత్యామ్నాయంగా సోయా పంటను కూడా ఎక్కువగానే సాగు చేస్తున్నారు. ప్రభుత్వం పెంచిన మద్ధతు ధరలతో జిల్లా రైతులకు మేలు జరిగే విధంగా ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పత్తికి అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉండడం తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పత్తి రైతులను ప్రోత్సహిస్తున్నాయి. అలాగే జిల్లా వాతావరణ పరిస్థితులు, నేలలు పత్తి పంటకు అనుకూలంగానే కనిపిస్తున్నాయి.



జరిగిన సంఘటన గురించి పోలీసులకు వివరిస్తున్న మేకల కాపరి

బావిలో పడ్డ మేకను కాపాడేందుకు వెళ్లి.. ఇరుక్కుపోయిన మేకల కాపరి

బోథ్, మే 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం పక్కన ఉన్న పంట చేనులో ఉన్న పాడుబడ్డ బావిలో మేత కోసం వెళ్లిన మేక ప్రమాదవశాత్తు బావిలో పడింది. గమనించిన మేకల కాపరి తన సహచరుడికి మేకపడ్డ విషయాన్ని చెప్పి రెండు తాళ్ల సాయంతో బావిలోకి దిగాడు అనంతరం బావిలో ఉన్న మేకను తాడుకు కట్టి పైకి లాగాలని సహచరుడికి సూచించడంతో మేకను పైకి లాగి రక్షించాడు. కాగా, బావిలోకి దిగిన కాపరి తాడు సాయంతో పైకి ఎక్కేందుకు ప్రయత్నించాడు. అయితే మధ్యలోకి రాగానే.. ఆయన చేతులకు పొక్కులు రావడంతో గత్యంతరం లేక తిరిగి బావిలోకి దిగవలసి వచ్చింది. లోపల మేకల కాపరి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని పైన ఉన్న మరో కాపరి స్థానికులకు తెలిపారు. దీంతో సంఘటన స్థలానికి ప్రజలు చేరుకొని ఆయనను బయటకు తీసేందుకు ప్రయత్నించారు. అయితే స్థానికులు రెండు తాళ్లను ఉయ్యాల ఆకారంలో కట్టి లోపలికి వేయడంతో బావిలో ఉన్న కాపరి దానిపై కూర్చొని బయటకు రావడం జరిగింది. సంఘటన విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు బావి వద్దకు చేరుకున్నారు. అంతేగాక జరిగిన సంఘటన విషయాన్ని ఇచ్చోడ అగ్నిమాపక సిబ్బందికి సైతం తెలియజేయడంతో.. సిబ్బంది హుటాహుటిన బావి వద్దకు చేరుకున్నారు. అప్పటికే స్థానికులు మేకల కాపరిని బయటకు తీయడం జరిగింది. ఏది ఏమైనా మేక కోసం బావిలోకి దిగిన కాపరి బయటకు వచ్చేంత వరకు ఉత్కంఠ నెలకొంది. కాగా పాడుబడ్డ బావులను కూల్చి వేయాలని గతంలో ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినా.. బావిని పూడ్చకపోవడంతో ఇలాంటి సంఘటన చోటు చేసుకుందని స్థానికులు పేర్కొన్నారు.

బోథ్‌లో మొండి బకాయిల వసూళ్లకు విద్యుత్ శాఖ స్పెషల్ డ్రైవ్

బోథ్, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్ శాఖ మొండి బకాయిల వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా విద్యుత్ శాఖ అధికారులు బకాయిలు పడ్డ వారి వద్దకు వెళ్లి బకాయిలు చెల్లించాలని నోటీసులు ఇస్తున్నారు. లేకుంటే విద్యుత్ కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరిస్తున్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు ఉంటాయని వినియోగదారులకు వివరిస్తున్నారు. ఇందులో జిల్లా అధికారి బి.శ్రీనివాస్, సిబ్బంది శ్రావణ్, దిగంబర్, సహని, తదతరులు పాల్గొన్నారు.

నిర్మల్‌లో కల్లు దుకాణం సీజ్

నిర్మల్ రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి) : కల్లు దుకాణంలో మైనర్ పిల్లలకు కల్లు అమ్ముతున్నారని ఫిర్యాదుతో దుకాణాన్ని సీజ్ చేసినట్లు ఎక్సైజ్, పట్టణ పోలీసులు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మంచిర్యాల ఎక్స్ రోడ్ వద్ద గల కల్లు దుకాణంలో చిన్న పిల్లలకు కల్లు అమ్ముతున్నారని ఫిర్యాదుతో జిల్లాలోని ఎక్సైజ్, టౌన్ పోలీసులు కలిసి అట్టి దుకాణం తనిఖీ చేయగా అక్కడ మైనర్లకు అమ్ముతున్నట్లు తేలింది. అక్కడ అమ్ముతున్న కూడా వ్యక్తి ఒప్పుకోవటంతో ఎక్సైజ్ పోలీసులు పట్టణ పోలీసుల సహాయంతో ఎక్సైజ్‌యాక్ట్ 1968 ప్రకారం షాపును సీజ్ చేశామన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ... జిల్లాలో ఎక్కడైనా కల్లు షాపులలో గాని, వైన్ షాపులలో చిన్న పిల్లలకు మందు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా మైనర్లకు మత్తు పదార్థాలు గాని, కల్లు గాని, వైన్ షాపులలో మందు బాటిళ్ల అమ్ముతున్నట్లు తెలిస్తే వెంటనే 8712659599కి సమాచారం ఇవ్వాలని తెలియజేశారు.

ఉద్యమకారుల గుర్తింపునకు కమిటీ ఏర్పాటు చేయాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉద్యమకారులు

నిర్మల్ కల్చరల్, మే 30 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పని చేసిన ఉద్యమకారులను గుర్తించేందుకు కమిటీ ఏర్పాటు చేయాలని ఉమ్మడి జిల్లా ఉద్యమకారుల ఫోరం చైర్మన్ కొట్టే శేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాకాల రాంచందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ పిలుపు మేరకు నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ఉద్యమకారులను గుర్తించి 250 చదరపు గజాల ఇంటి స్థలం మంజూరు, పెన్షన్ తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రాణాలు పణంగా పెట్టి స్వరాష్ట్ర సాధనకు ఉద్యమకారులు పోరాటం చేశారన్నారు. గత ప్రభుత్వ పాలనలో నిరాదరణకు గురయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర అవతరణ రోజున తమకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తారన్న ఆశాభావం వారు వ్యక్తం చేశారు. కిరణ్‌రెడ్డి, ఇస్మాయిల్, నర్సయ్య, శంకర్, వినోద్, చోట కలీం, అక్రమ్, తదితరులు పాల్గొన్నారు. అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఉపాధి హామీ పనుల్లో సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనుల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం ముందు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఉపాధి హామీ కూలీల కూలీరేట్లు రూ. 600లకు పెంచాలని, సంవత్సరానికి 200ల రోజులు పని దినాలు కల్పించాలని, ఉపాధి హామీ పనుల్లో సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. ఈ ధర్నాలో జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బర్కుంట గంగారాం తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం.. రోడ్డెక్కిన అన్నదాతలు



అంబులెన్స్‌కు దారి ఇస్తున్న దృశ్యం



తురాటి ఎక్స్ రోడ్ వద్ద రైతులు ధర్నా చేస్తున్న రైతులు

నర్సాపూర్(జి), మే 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తురాటి కొనుగోలు కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రాల వద్ద వడ్ల కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందని శుక్రవారం అన్నదాతలు తురాటి ఎక్స్ రోడ్ జాతీయ రహదారిపై రైతులు ధర్నా నిర్వహించారు. కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నారని, తప్ప, తరుగు పేరుతో కోతలు విధిస్తున్నారని, తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గత మూడు రోజుల నుండి వర్షాలు పడుతున్నాయని కల్లాల్లో ధాన్యం పేరుకుపోతున్నాయని, తక్షణమే కొనుగోళ్లు చేపట్టాలని, రైస్‌మిల్లుర్లు వాపస్ పంపిన ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ రాస్తారోకోలో రోడ్డు ఇరువైపులా ఒక కిలో మీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. రైస్ మిల్లర్లకు సొసైటీ, ఐకేపీ సిబ్బంది తొత్తులుగా మారారని రైతులకు ఇష్టారీతిన తూకం వేసి, కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నారని, రోడ్డు పై ఇదేమి రాజ్యం ఇదేమి రాజ్యం దోపిడీ రాజ్యం, దొంగల రాజ్యం అని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కలెక్టర్ వచ్చేంత వరకు రాస్తారోకో చేస్తామని రైతులు రోడ్డుపై బైఠాయించారు. నర్సాపూర్(జి) మండల తహసీల్దార్ శ్రీకాంత్, ఎస్సై సాయి కిరణ్ సంఘటన స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడి రెండు రోజుల్లో కొనుగోళ్లు వేగవంతం చేసి కేంద్రాల్లోని ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తామని, లారీలను వెంటనే తెప్పిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించి వెనుదిరిగారు.

రైతులు ధర్నా నిర్వహిస్తున్న సమయంలో నర్సాపూర్ మండలం నుండి భైంసా వైపు వెళ్తున్న 108 వాహనానికి దారి ఇచ్చి రైతులు మానవత్వాన్ని చాటుకున్నారు.

వినతిపత్రం అందజేసిన తురాటి గ్రామ రైతులు

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీకాంత్‌కు ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని వినతి పత్రం అందజేశారు.



తురాటి ఎక్స్ రోడ్ వద్ద ధాన్యం పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్



వాహనాలు నిలిచిపోయిన దృశ్యం

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

● జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్

నిర్మల్ కల్చరల్, మే 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉంటారని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్ అన్నారు. శుక్రవారం గాంధీనగర్‌లో నిర్వహించిన డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలించారు. దోమలు అభివృద్ధి చెందకుండా ఉండాలంటే లార్వా స్థాయిలోనే పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ప్లాస్టిక్ డబ్బాలు, టైర్లు, పగిలిన రంజన్లు, తదితర వాటిని తొలగించాలని సూచించారు. వర్షాల దృష్ట్యా ప్రజలు నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. ఆరోగ్య పర్యవేక్షకుడు భోజారెడ్డి, సహాయకుడు పురుషోత్తం, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెర్కపల్లె గ్రామంలో డ్రై డే

దస్తురాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నాగరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని పెర్కపల్లె గ్రామంలో డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి శైలేంద్ర కన్నయ్య, హెచ్‌వి. సంతోష్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాతా



అందకూర్‌లో ఆట పాటలతో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

కుంటాల, మే, 30 : (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశాపెడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కళాజాత ప్రదర్శన ద్వారా ఆట, పాట రూపంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం అందకూర్ గ్రామంలో కళాజాత బృందం ఆధ్వర్యంలో ఇట్టి కార్యక్రమంపై అవగాహన కల్పించారు.

తహసీల్దార్‌ను సన్మానించిన బీజేపీ నాయకులు

లోకేశ్వరం, మే 30 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండల కేంద్రానికి నూతనంగా వచ్చిన తహసీల్దార్ సర్వరాజ్‌ను లోకేశ్వరం మండల బీజేపీ నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... తహసీల్దార్ కార్యాలయంలో ఏవైతే సమస్యలు ఉన్నాయో వాటిని త్వరగా పరిష్కరించాలని కోరారు. అంతేకాకుండా ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉండాలన్నారు.



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

సారంగాపూర్, మే 30 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని నిర్మల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జీ రామ్‌కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గల రాజీవ్‌కాటన్ మార్కెట్‌యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు జామ్. యాకర్‌పల్లి, మలక్‌చించోలిలలో గల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి రైతులను వివరాలను అడిగి తెలుసుకొని కొనుగోలు నిర్వాహకులతో మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని కోత లేకుండా రెండు రోజుల్లో పూర్తిగా కొనుగోలు చేయాలని అధికారులతో పేర్కొన్నారు. లేనియెడల నిర్మల్ పట్టణంలో రైతులతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జీవన్‌రావు, దేవి శంకర్, బుల్లెడ భోజారెడ్డి, ఐర శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనారాయణగౌడ్, లక్ష్మణ్, సతీష్‌గౌడ్, బోసాని భోజన్న, నర్సయ్య, చిన్నయ్య, చాట్ల చిన్నయ్య, వెంకట్ శ్రీధర్, పత్తి సాయన్న, ఎకిలేరి భోజన్న, నరేష్, గట్టు గంగాధర్‌లు ఉన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



కల్లూరులో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డీపీవో శ్రీనివాస్

కుంటాల, మే, 30 : (ఆంధ్రజ్యోతి) : రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠినచర్యలు తప్పవని డీపీవో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని కల్లూరు తదితర లగ్రామాలలో విత్తనాలు, ఎరువుల దుకాణాలను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు ఓరిజినల్ రశీదు పొందాలన్నారు. విత్తనాల కొనుగోళ్లలో తొందరపడకూడదన్నారు. అంతేగాకుండా దుకాణాల యజమానులు నాణ్యమైన విత్తనాలను రైతులకు విక్రయించాలన్నారు.

దస్తురాబాద్ మండలంలో ఎరువుల దుకాణాల తనిఖీ

దస్తురాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి) : నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల ఇన్‌చార్జి స్పెషల్ ఆఫీసర్ నాగవర్ధన్, తహసీల్దార్ బత్తుల విశ్వంబర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎరువుల దుకాణాలలో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న వేళ ఎరువుల దుకాణాల యజమానులు నకిలీ విత్తనాలు అమ్మితే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఎరువులను, విత్తనాలను అధిక ధరలకు రైతులకు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు విత్తనాలను, ఎరువులను కొనేటప్పుడు తప్పనిసరిగా రసీదులను తీసుకోవాలని సూచించారు. అనుమతి లేని వ్యక్తులు గ్రామాల్లో తిరిగి విత్తనాలను అమ్మితే వ్యవసాయ శాఖ అధికారులకు, పోలీసుశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి తిరుపతి, స్థానిక ఎస్సై సాయి కుమార్, సీనియర్ అసిస్టెంట్ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి పాడైన నువ్వు పంట

● నష్ట పరిహారం ఇవ్వాలంటున్నరైతులు

లక్ష్మణచాంద, మే 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో గల నువ్వు పంట మూడు రోజుల క్రితం కురిసిన వర్షానికి పాడైంది. తోటలలోని పంట గాలివానకు నేలపై ఒరిగిపోగా, కల్లాల్లో ఉన్న పంట తడిసి ప్రయోజనం లేకుండా పోయింది. ముఖ్యంగా గోదావరి సమీప గ్రామాలైన మునిపెల్లి, పార్పెల్లి, ధర్మారం, మాచాపూర్, చింతల్ చందా, పీచర, వడ్యాల్, రాచాపూర్, కనకా పూర్, తిరుపెల్లి, బోరిగాం, బాబాపూర్, నర్సాపూర్(డబ్ల్యూ), కంజర్, తదితర గ్రామాల్లో తోటలలో గల నువ్వు పంటలు నేలకొరిగాయి. అలాగే కోసి ఆరబెట్టిన నువ్వు కుప్పలన్నీ తడిసి కాయలన్నీ నల్లగా మారాయి. మండలం మొత్తం మీద 720 ఎకరాలలో నువ్వు పంట సాగు చేయగా దాదాపు వందలాది ఎకరా లలో నువ్వు పంట నేలకొరిగింది. తద్వారా నువ్వులు పాడై పంట నష్టం వచ్చిన ట్లు రైతులు తమ గోడును వెల్లబోసుకుంటున్నారు. కావునా ప్రభుత్వం సర్వే నిర్వహించి నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.


మునిపెల్లిలో నేలకొరిగిన నువ్వు పంట

చేతికొచ్చిన పంట నేలకొరిగి నష్టం వాటిల్లింది

- కమల్‌కోట రాజారెడ్డి, రైతు, మునిపెల్లి



ఆరుగాలం కష్టపడి పండించిన పంట నోటికి అందినట్లే అంది చేజారి పోయింది. కోత దశలో గాలివాన బీభత్సానికి నువ్వు పంటంతా నేల కొరిగింది. కల్లాల్లో ఆరబెట్టిన పంట తడిసి కాయ నల్లగా మారి నువ్వుల దిగుబడికి నష్టం వాటిల్లింది. తద్వారా పెట్టుబడి పెట్టిన వేలాది రూపాయలు నష్టపోయాం. కాబట్టి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- వ్యవసాయ అధికారి వసంత్ రావు

వాస్తవంగా తోటలలో నిలువుగా ఉన్న పంటకు నష్టం వాటిల్లితే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుంది. కల్లాల్లో ఉన్న పంటకు నష్టం వాటిల్లితే ప్రభుత్వం నుండి నష్టపరిహారం రాదు. కాబట్టి సర్వే చేపడితే గాని ఎలాంటి పంటకు ఎంత నష్టం వాటిల్లింది అనేది చెప్పగలం. ప్రభుత్వ ఆదేశానుసారం మండలంలో సర్వే చేపడతాం. వర్షానికి గాలివాన బీభత్సానికి నష్టపోయిన పంటను సర్వే చేసి నివేదికలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తాం. ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి నష్టపరిహారం చెల్లించేలా చూస్తాం.

'నువ్వు' రైతు ఆశలపై వరుణుడి నీళ్లు

● ఇటీవల కురిసిన వర్షాలకు తడిసి ముద్దయిన నువ్వు పంట ● ఒక్క రాజుర ప్రాంతంలోనే వందల ఎకరాలలో నష్టం ● వర్షానికి తడిసి కల్లాల్లోనే మొలకెత్తిన నువ్వు ● అధికారులు కన్నెత్తి చూడడం లేదంటూ రైతుల ఆవేదన ● పంట నష్టం తమ దృష్టికి రాలేదంటూ చేతులెత్తేస్తున్న వ్యవసాయ అధికారులు ● నష్ట పరిహారం అందించాలని వేడుకోలు

ఖానాపూర్, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఆశలతో నూనె గింజల పంటను సాగు చేసుకుని నాలుగు రాళ్లు వెనకేసుకోవాలనుకున్న ఖానాపూర్ మండల రైతాంగం ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. మండల వ్యాప్తంగా గత యాసంగిలో 1480 ఎకరాల నువ్వు పంటలు సాగు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇటీవల వరుసగా కురిసిన వర్షాలకు నువ్వు పంట తడిసిపోయింది. మండలంలో వరి పంటకు ప్రత్యామ్నాయంగా పలువురు రైతులు నువ్వు పంట సాగుపై మొగ్గు చూపారు. అన్నదాత ఆశించిన విధంగానే ఈ యాసంగిలో నువ్వు ఆశాజనకంగా వచ్చింది. పంట చేతి కచ్చి నువ్వు కోసి కుప్పేసిన తర్వాత వరుసగా కురిసిన వర్షాలు నువ్వు రైతు ముఖంపై నవ్వును ఆవిరి చేశాయి. ప్రస్తుతం మండలంలో ఎక్కడ చూసినా నువ్వు కలాల్లో మొలకెత్తిన నువ్వు పంట దర్శనమిస్తోంది.

ఒక్క రాజుర ప్రాంతంలోనే వందల ఎకరాల్లో నష్టం..

మండలంలోని రాజుర ప్రాంతంలో నువ్వు రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు చెబుతున్నారు. రాజుర గ్రామంలో రైతులు గత యాసంగిలో 406 ఎకరాల్లో నువ్వు పంటను సాగు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ముందు చేతికి అందిన నువ్వులు మాత్రమే రైతన్న ఇంటికి చేరాయి. మెజారిటీ రైతుల నువ్వులు ఇంకా కల్లాల్లోనే ఉన్నాయి. వరుసగా నాలుగైదు రోజులు వర్షాలు కురవడంతో నువ్వు పంట పూర్తిగా తడిసిపోయి పంట కల్లాల్లోనే మొలకలు వచ్చి ఆకులు వచ్చిన పరిస్థితి తలెత్తింది. రాజుర ప్రాంతంలో సుమారు 100 నుండి 150 ఎకరాల వరకు నువ్వు పంట నష్టం జరిగినట్లు రైతులు చెబుతున్నారు. ఒక్కో ఎకరానికి ఐదు క్వింటాళ్ల మేరకు దిగుబడి వస్తుందని, ఈ వర్షానికి పూర్తి స్థాయిలో పంట నష్టపోవాల్సి వచ్చిందని నువ్వు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో ఎకరానికి సుమారు 50 వేల వరకు నష్టం జరిగిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తమకు జరిగిన పంట నష్టంపై క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించి నష్టపరిహారం అందజేయాలని కోరుతున్నారు.



ఇటీవల కురిసిన వర్షాలకు రాజుర గ్రామంలో కల్లాల్లోనే మొలకెత్తి ఆకులు వచ్చిన నువ్వు

తమ దృష్టికి రాలేదని చేతులెత్తేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు..

ఇటీవల కురిసిన వర్షాలకు క్షేత్రస్థాయిలో నువ్వు పంటకు భారీగా నష్టం కలిగిందని రైతులు చెబుతున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం తమ దృష్టికి రాలేదంటూ చేతులు దులిపేసుకుంటున్నారు. ఒక దశలో మండలంలో నువ్వు పంట ఎక్కడ నష్టపోలేదని చెప్పిన అధికారులు రాజుర గ్రామంలో జరిగిన నష్టాన్ని ఆంధ్రజ్యోతి వివరించడంతో క్షేత్ర స్థాయిలో ఉన్న అధికారులు తమకు తెలుపలేదని ఏవో చెప్పి చేతులు దులుపుకున్నారు. మండలంలోని ఒక్క రాజుర గ్రామంలోనే వందల ఎకరాలలో నువ్వు పంట తడిసి మొలకలు వచ్చిన నేపథ్యంలో ఇకనైనా అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించాలని రైతులు కోరుతున్నారు. రాజుర సహా అన్ని గ్రామాల్లో యాసంగి ఆరంభానికి ముందే పంట వివ రాలను నమోదు చేసుకున్న అధికారుల వద్ద నువ్వు పంట ఏఏ రైతులు సాగు చేశారో వివరాలు ఉన్నాయని ప్రస్తుతం వారి పరిస్థితి ఏంటో క్షేత్ర స్థాయిలోకి వెళ్లి పరిశీలించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని వివరిస్తే తమకు ప్రభుత్వం నుండి ఏమైనా నష్టపరిహారం దక్కుతుందని రైతులు ఆశిస్తున్నారు.

జరిగిన నష్టం మా దృష్టికి రాలేదు..

- జగదీశ్వర్, ఏవో, ఖానాపూర్

ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో నువ్వు పంట నష్టం జరిగినట్లు రైతులు గాని క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే ఏఈవోలు గాని మా దృష్టికి తీసుకురాలేదు. రాజుర గ్రామంలో నష్టం జరిగినట్లు ఏ ఒక్క రైతు కూడా మాకు తెలుపలేదు. జరిగిన నష్టాన్ని మా దృష్టికి తీసుకువస్తే క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం.

మూడెకరాల నువ్వు మొత్తం మొలకెత్తింది..

- చేగంటి మల్లేష్, రైతు రాజుర గ్రామం



మూడు ఎకరాలలో నువ్వు సాగు చేస్తే ఇటీవల కురిసిన వర్షాలకు మొత్తం తడిసిపోయి మొలకలు వచ్చింది. సుమారు రూ. 1.50 లక్షల న ష్టం జరిగింది. ఇప్పటి వరకు ఏ అధికారి కూడా మా పరిస్థితిని పరిశీలించలేదు. ఇప్పటికైనా మాకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

నష్టపరిహారం అందించి ఆదుకోవాలి..

- వేముల చిన్నయ్య, రైతు, రాజు గ్రామం



రెండు ఎకరాలలో నువ్వు పంట వేశాను. ఇటీవల కురిసిన వర్షాలు మాకు తీరని నష్టాన్ని కలిగించాయి. సుమారు లక్ష రూపాయల వరకు నష్టం జరిగింది. నాతో సహా మా గ్రామంలో వందల ఎకరాలలో నువ్వు పంట తడిసి మొలకలు వచ్చింది. అధికారులు స్పందించి మాకు నష్టపరి హారం అందజేసి ఆదుకోవాలి.


జాతీయ రహదారిపై కారుకు అడ్డంగా వచ్చిన పశువులు..


ఇటీవల ప్రమాదం జరిగిన సంఘటన స్థలం సమీపంలో ఆకస్మాత్తుగా రోడ్డుకు అడ్డంగా వచ్చిన ఆవును ఢీకొడుతున్న లారీ

ప్రాణాలు పోతున్నాయి.. పట్టించుకోండి?

● ఎన్‌హెచ్ 44 జాతీయ రహదారిపై పశువుల సంచారం ● రహదారి నిర్వహణను పట్టించుకోని అధికారులు

ఇచ్చోడ, మే 30 (ఆంధ్రజ్యోతి): ఉత్తర దక్షిణ భారత దేశాన్ని కలిపే 44వ జాతీయ రహదారి కాశ్మీర్ నంచి కన్యాకుమారి వరకు దేశంలోనే పొడ వైన రహదారి. ఈ రహదారిని 2010వ సంవత్సరంలో నాలుగు వరుసల రహదారిగా విస్తరించారు. జంతువులు, పశవుల సంచారం పూర్తిగా నిషేధించి, రక్షణ కంచెను ఏర్పాటుచేశారు. క్రమంగా కంచె మనుమరుగవుతూ పశువుల సంచారం అధికమవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నా అధికారులు పట్టించుకోవట్లేదు. జాతీయ రహదారిపై ఆకస్మిత్తుగా పశువులు దారికి అడ్డంగా వచ్చేసరికి వందల సంఖ్యలో ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోగొట్టుకున్న అధికారులు తమకేం పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని వాహన దారులు ఆందోళన చేపట్టిన సమస్య అలాగే ఉండిపోయింది. రహదారి మధ్యలో గల డివైడరుపై గ్రాసం కోసం గ్రామల దగ్గర ఉన్న పశువులు రోడ్లపై సంచరించడం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర వుతున్నాయి. అప్రమత్తత లేనప్పుడు పలుమార్లు ప్రమాదాలు సైతం చో టుచేసుకుంటున్నా.. రోడ్లపైకి పశువులు రాకుండా అరికట్టాలని వాహన దారులు పలు మార్లు కొరతున్నా.. ఈ విషయాన్ని అధికారులు సైతం పెడచెవిన పెడుతున్నారు.


సంఘటన స్థలంలో బొల్తాపడిన ఆటో

జాతీయ రహదారిపై పశువులు అడ్డు రావడంతో ఘోర రోడ్డు ప్రమాదం

ఇటీవల ఇచ్చోడ మండలం కోకస్‌మన్నూర్ గ్రామానికి వెళ్లే దారి వద్ద జాతీయ రహదారిపైకి ఆకస్మాత్తుగా నాలుగు పశువులు అడ్డురావడంతో అదుపు తప్పిన లారీ ఆర్టీసీ బస్సు, ఆటో, ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. లారీ ఒక్కసారిగా బస్సును ఢీకొట్టడంతో బస్సు కొంత దూరం వరకు వెళ్లి డివైడర్‌పైకి దూసుకెళ్లి ఆగిపోయింది. బస్సును ఢీకోన్న లారీ ఆటోను, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఆటో అదుపుతప్పింది. ద్విచక్రవాహనం టీవీఎస్ ఎక్స్‌ఎల్ సైతం అదుపు తప్పి కిందపడడంతో బస్సులో ప్రయాణిస్తున్న జైనథ్‌కు చెందిన మేకల భీమక్క ఈ సంఘటనలో మృతి చెం దింది. బస్సులో ఉన్న ప్రయాణికులకు, ఆటోలో ఉన్న ప్రయాణికులు, ద్విచక్రవాహన దారులకు తీవ్ర గాయాలవ్వగా.. ప్రమాదానికి గురైన పశువుల యాజ మానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సంఘటన స్థలంలో నలుగు పశువులు అక్కడికక్కడే మృతి చెందాయి. ఇలాంటి సంఘటనలు జరగు తున్న పాడి రైతులు మాత్రం తమకేమి పట్టనట్టుగా ఉంటున్నారు.

డివైడర్లపై మేత మేస్తున్న పశువులు

రహదారి విస్తరణలో భాగంగా రహదారుల మధ్యన డివైడర్‌లను ఏర్పా టుచేసి మట్టిపోసం పూల మొక్కలు నాటారు. అందులో గడ్డి సైతం విపరీతంగా పెరుగుతుండడంతో కొందరు పశువుల కాపరులు వాటిపైనే ఆవులు, గేదేలను మేపుతున్నారు. నడిరహదారులపైన సేద తీరుతున్నాయి. మేత మేస్తూ దాటుతున్నట్లు సమాచారం.

చేయాల్సిన పనులు

జాతీయ రహదారిపై పశువులతో పాటు జంతువుల సంచారం లేకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసకోవాల్సి ఉంది. రక్షణ కంచె లేని చోట వాటిని ఏర్పాటు చేయించాలి. గ్రామాల్లో అవగాహన కల్పించి రోడ్లపై పశువులు సంచరించకుండా చూడాలి. స్పందించిన పశువుల యజమానులపై చర్యలు తీసుకోవాలి. జాతీయ రహదారి సమీప గ్రామాల ప్రజలు పశువులకు రాత్రుల్లో మెరిసే స్టిక్కర్లు అంటించాలి. డివైడర్ల మధ్య పెరిగిన గడ్డిని వెంటవెంటనే తొలగించాలి. ఏపుగా పెరిగిన మొక్కలను కత్తిరింపజేయాలి. హైవేపై గస్తీ కాస్తున్న పోలీసు, రహదారి నిర్వహణపై శ్రద్ధ చూపాలి.

అర్హులకేదీ.. ఇందిరమ్మా?

● ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో నాయకులదే పెత్తనం
● ఇందిరమ్మ కమిటీ సభ్యులకే ఇళ్ల కేటాయింపు

సిరికొండ రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం అర్హులైన లబ్ధిదారులకు అందకుండా పోతుంది. నిరుపేదలైన వారి కుటుంబాలకు కేటాయించకుండా ఆయా పార్టీలకు చెందిన కార్యకర్తలకు, ఇందిరమ్మ కమిటీ సభ్యు లకు ఇళ్లు కేటాయించడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీల న చేయాల్సిన మండల స్థాయి అధికారులు అనర్హులైన లబ్దిదారుల వారినే ఎంపిక చేయడంతో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు అంద కుండా పోతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ప్రతీ గ్రామంలో అర్హులైన లబ్ధిదారులను కోసం గ్రామ సభలు నిర్వహించి, ఎంపికైన లబ్ధిదారుల వివరాలను గ్రామ పంచాయతీ కార్యాలయంలో నోటీసు బోర్డుపై ప్రదర్శించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో అధికారులు, నాయకులు కుమ్మక్కై చేతివాటం ప్రదర్శిం చడం వల్లనే అనర్హులకు ఇళ్లు దక్కాయనీ, ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఎంపిక చేసిన వారిలో చాలా వరకు గత కాంగ్రెస్ ప్ర భుత్వం హయాంలో మంజూరు చేసిన ఇంది రమ్మ ఇళ్ల లబ్ధిదారులకు, ఇందిరమ్మ కమిటీ సభ్యులకు మంజూరు చేశారు. సిరికొండ మండల పరిధిలో 19 గ్రామ పంచాయతీలు ఉండగా మొదటి, రెండవ విడతలో భాగంగా మొత్తం 439 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో ఖానాపూర్ నియోజకవర్గంలోని ఐటీడీఏ పరిధిలో ప్రత్యేక కెటగిరీ కింద ధర్మసాగర్, జెండాగూడ, పోచంపల్లి గ్రామాల కు చెందిన ఆదివాసీ కొలాం గిరి జనులకు 98 ఇళ్లు, అలాగే వివిధ గ్రామాల్లో అమరవీరుల కుటుంబాలకు నాలుగు ఇళ్లు మంజూరయ్యాయి. అయితే ఈ మండలం రెండు నియోజకవర్గాల పరిధిలో ఉండడం వల్ల మొదటి విడత కింద ఖానాపూర్ నియోజకవర్గం పరిధిలోని రిమ్మ గ్రామపంచాయతీకి 153 ఇళ్ళు కేటాయించారు. రెండ వ విడతలో భాగంగా ఇటు బోథ్, అటు ఖానాపూర్ నియోజకవర్గాలకు కలిపి మొత్తం 184 ఇళ్ళను ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే ఖానాపూర్ నియోజకవర్గ పరిధిలో మొదటి విడతలో పైలట్ ప్రాజెక్టు కింద ఒకే గ్రామపంచాయతీకి 153 ఇళక్లా కేటాయించి, రెండవ విడతలో కేవలం 37 ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేశారు. దీంతో ప్రతీ గ్రామంలో అర్హులైన గిరిజనులు ఎందరో ఉన్నప్పటికీ, గ్రామానికి రెండు, మూడు ఇళ్లు కేటాయించడంతో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు అందడం గగనంగానే కనిపిస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా బోథ్ నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో రెండో విడత కింద 147 ఇళ్ళను కేటాయించారు. ఇక్కడ ఇరు పార్టీలకు చెందిన రాజకీయ నేతలు ఉండడంతో.. మొదట ఇందిరమ్మ కమిటీ సభ్యుల ఎంపికలోనే గందరగోళం ఏర్పడడంతో ఆ తర్వాత స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్ చొరవ తీసుకుని, ఆ కమిటీల్లో ఇరు పార్టీలకు చెందిన రాజకీయ నేతలకు చెందిన సభ్యులకు అవకాశం కల్పించారు.


సిరికొండలో రేకుల గుడిసెలో నివసిస్తున్న ఓ నిరుపేద కుటుంబం

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

కాంగ్రెస్ సర్కారు నిరుపేదలకు ఇందిరమ్మ గృహం మంజూరు చేస్తుందని నమ్మకంతో ప్రజా పాలనలో భాగంగా దరఖాస్తు చేసుకుంటే ఇక్కడున్న నాయకులు, మండల స్థాయి అధికారుల నిర్లక్ష్యంతో ఇందిరమ్మ గృహం మంజూరు కాలేదు. నా కుటుంబ పరి స్థితిని నేరుగా పరిశీలించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి.

- షేక్ అల్లభకాష్, సిరికొండ గ్రామం

● అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేశాం

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో అర్హులైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారు లను ఎంపిక చేయడం జరిగింది.

- రవీందర్, ఎంపీడీవో, సిరికొండ

దుబార్‌పేట్ టు దుబాయ్

● అవతరణ దినోత్సవ ప్రదర్శనలకు ఆదివాసీ కళాకారులు

ఇచ్చోడ, మే 30 (ఆంధ్రజ్యోతి) : మారుమూల గిరిజన గ్రామం నుంచి దు బాయ్‌లో జరిగే వేడుకల్లో ప్రదర్శనలు ఇచ్చేందుకు అవకాశం రావడం అదృష్టమని ఆ గిరిజన యువకులు ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర 11వ అవతరణ దినోత్సవ వేడుకలలో జూన్ 1వ తేదీన ప్రదర్శనలు చేయడానికి ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని దుబార్‌పేట్ గ్రామానికి చెందిన యువకులు శుక్రవారం దుబాయ్ బయలుదేరి వెళ్లారు. దుబాయ్‌లోని అబుదాబిలో తెలంగాణ ఫ్రెండ్స్ అసోసియేషన్, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర అవతరణ వేడుకల్లో ప్రదర్శన ఇచ్చేందుకు ఆదివాసీ సకల కళ సంక్షేమ సంఘం కళాకారులు కాత్లే శ్రీధర్, కాత్లే ఆనంద్‌లు బయలుదేరారు.


హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కళాకారులతో దుబార్‌పేట్ యువకులు

మహిళా సంఘాల ద్వారా

బడి పిల్లల దుస్తుల తయారీ

ఉట్నూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు పునః ప్రారంభం అయ్యేలోపు ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల దుస్తుల తయారీ కోసం కావాల్సిన వస్త్రాలను మండల విద్యా వనరుల కేంద్రాల ద్వారా ఇందిరా క్రాంతి పథం ఉద్యోగులకు పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వం నేరుగా ఆయా మండలాల్లోని పాఠశాలల విద్యార్థుల కోసం వేసవి సెలవులకు ముందే నిక్కర్లు, బాలికల పైజామాల కుట్టుట కోసం బట్టను పంపిణీ చేసిన ప్రభుత్వం షర్టులు కుట్టడానికి కావాల్సిన వస్త్రాలను ఎంఆర్‌సీలకు చేరవేయడంతో శుక్రవారం నుంచి ఉట్నూర్ మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రం ద్వారా మండల కో ఆర్డినేటర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో ఐకేపీ సీసీలకు బట్టను అందించారు. ఐకేపీ సీసీల ద్వారా మహిళ సంఘాలకు చెందిన బట్టలు కేట్టే వారికి వస్త్రాలను సరఫరా చేసి పాఠశాలలు ప్రారంభంనాటికి అందించేలా ఆదేశాలు జారీ చేశారు. ఉట్నూర్ మండలంలోని 66 ప్రభుత్వ పాఠశాలతో పాటు కస్తూర్బాగాంధీ విద్యాలయం, 70 గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు కావాల్సిన బట్టను సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సీసీలు చంద్రకళ, రాజారత్నం, విఠల్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


ఐకేపీ ఉద్యోగులకు బడి పిల్లల దుస్తుల వస్త్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఫొటో న్యూస్



ఆదిలాబాద్ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం


సిబ్బంది లేక పోవడంతో ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

'ఉపాధి'లో ఉద్యోగులేరీ..?!

నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే జిల్లా ఉపాధి కల్పన శాఖలోనే ఉద్యోగులు కరువయ్యారు. ఈ శాఖలో రెండేండ్ల క్రితం అవినీతి నిరోదక శాఖ చేపట్టిన దాడిలో ఆ శాఖ ఉన్నతాధికారితో పాటు మరో కింది స్థాయి ఉద్యోగి పట్టుబడ్డారు. దీంతో అప్పటి నుంచి ఈ శాఖను పర్యవేక్షించే అధికారులు లేకుండా పోయారు. ప్రస్తుతం ఇతర శాఖకు చెందిన ఓ మహిళ అధికారి ఇన్‌చార్జీ బాధ్యతల్లో కొనసాగు తుండగా మరో రెగ్యూలర్ ఉద్యోగి సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించే ఈ శాఖలోనే ఉద్యో గులు లేకుండా పోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వం, ఉన్నతాదికారులు దృష్టి సారించి అవసరమైన అధికారులు, సిబ్బందిని నియమించాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

● (ఆంధ్రజ్యోతి ఆదిలాబాద్ స్టాఫ్‌ఫొటోగ్రాఫర్)


కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి

ప్రాణాలు పోతున్నాయి.. పట్టించుకోండి?
● ఇచ్చోడలో ఎన్‌హెచ్ 44 జాతీయ రహదారిపై పశువుల సంచారం
● తరచూ ప్రమాదాలు



వివరాలు 7వ పేజీలో...

ప్రతిభ కళాశాలలో ఎంపికకు 4న స్పాట్ కౌన్సెలింగ్ : పీవో

ఉట్నూర్, మే 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిమ గిరిజన తెగలకు చెందిన కోలాం, తోటి విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసి ఉండి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ కోర్సులలో హయత్‌నగర్‌లోని తెలంగాణ గిరిజన సంక్షేమ ప్రతిభ కళాశాలలో ప్రవేశం పొందడానికి జూన్ 4న ఉట్నూర్ కొమురంభీం ప్రాంగణలోని బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు పూర్తి వివరాల కోసం గురుకులం రీజినల్ కోఆర్డినేటర్‌ను సంప్రదించాలన్నారు. ప్రవేశాల కోసం ఆసక్తి ఉన్న బాలబాలికలు మెమో, బోనఫైడ్, టీసీ, కుల, ఆదాయం, ఫిజికల్ ఫిట్నెస్, ఆధార్ సర్టిఫికెట్స్ రెండు జతల జిరాక్స్, నాలుగు పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. ఈ అవకాశాన్ని ఆదిమ గిరిజన పీవీటీజీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పీవో కోరారు.

● మినీ గురుకులాల్లో మిగిలిన సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఉట్నూర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నాలుగు గిరిజన మినీ గురుకులాల్లో ఒకటవ తరగతి మరియు మిగిలిన ఇతర తరగతులలో సీట్ల కోసం ప్రవేశాల కోసం గిరిజన బాలికలు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా ఒక ప్రకటనలో కోరారు. ఆయా మండలాలకు చెందిన వారు మాత్రమే జూన్ 6 వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. లోకారి మినీ గురుకులంలో ఒకటవ తరగతిలో 30 సీట్లు, ఐదవ తరగతిలో 18 సీట్లు, బేల (సదల్పూర్) మినీ గురుకులంలో 1వ తరగతిలో 30, ఐదవ తరగిలో 10 సీట్లు ఉన్నాయన్నారు. నేరడిగొండ మండలం (గుత్పాల) మినీ గురుకులంలో ఒకటవ తరగతి సీట్లు, రెండులో నాలుగు, ఐదులో 8 సీట్లు ఉన్నాయన్నారు. ఉమ్మడి జిల్లాలోని మామడ మినీ గురుకులంలో ఒకటో తరగతి సీట్లు, ఐదవ తరగతిలో 6 సీట్లు ఉన్నాయని కోలాం, తోటిలకు చెందిన పీవీటీజీ విద్యార్థులకు మాత్రమే మొదటి ప్రాధాన్యం ఉంటుందని, జూన్ 9న ఐటీడీఏలో నిర్వహించే లక్కీ డ్రా ద్వారా సీట్లు కేటాయించడం జరుగుతుందని, పూర్తి వివరాల కోసం గురుకులం ఆర్‌సీవోలను సంప్రదించాలని పేర్కొన్నారు.

నేటి నుంచి ఈజీఎస్ గ్రామసభలు

భీంపూర్, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సంబంధించిన నాల్గవ విడత సోషల్ ఆడిట్ సభల వివరాలను శుక్రవారం ఏపీవో సంగీత వివరించారు. 31న గుబ్డిపల్లి, ఇందూర్‌పల్లి, జూన్ 1న పిప్పల్‌కోటి, మార్కాగూడ, వడగాం, కరంజి(టి), టెక్డి రాంపూర్, అందర్‌బంద్, అంతర్గం, బెల్సర్ రాంపూర్, ధన్నోరా, గోముత్రి, జూన్ 4న తాంసి(కె), గొల్లగాడ్, గుంజల భగవాన్‌పూర్, గుబ్డి, వాడర్, ఖైర్‌గూడ, గోన, జాలకోరి, కామాట్‌వాడ, కరణ్‌వాడి, అర్లి(టి), భీంపూర్ గ్రామాలలో గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గ్రామసభలు ఉంటాయని ఆమె తెలిపారు. దీనికి సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని సూచించారు.

2న మంత్రి సీతక్క పర్యటన

బోథ్, మే 30(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క జూన్ 2న మండలంలో పర్యటించనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను మండల అధికారులు చేస్తున్నారు. రాజీవ్ వికాసం పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు మంత్రి చేతుల మీదుగా మంజూరి అయిన ధ్రువీకరణ పత్రాలు అందించనున్నారు.

గడువు పెంచడం పట్ల హర్షం

బోథ్, మే 30(ఆంధ్రజ్యోతి): జొన్న పంట కొనుగోళ్లకు 29 వరకు చివరి తేదీగా అధికారులు ప్రకటించారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జి.రాజుయాదవ్ రైతుల సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన కలెక్టర్ ఈనెల 31 వరకు బోథ్ మార్కెట్లో జొన్న పంట కొనుగోలు జరుపుకునే విధంగా అనుమతులు ఇవ్వడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. పంట కొనుగోళ్లకు గడువు పెంచడం పట్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, రైతులు హర్షం వ్యక్తం చేశారు.

'కొనుగోలు తేదీని పొడిగించాలి'

నేరడిగొండ, మే 30(ఆంధ్రజ్యోతి): జొన్నల కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని, కొనుగోలు తేదీని పొడిగించాలని సామాజిక కార్యకర్త సాబ్లే సంతోష్ సింగ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కొనుగోలు ప్రక్రియ ఆలస్యంగా సాగుతుండడంతో జొన్నల కొనుగోలు కేంద్రాల వద్ద వివిధ గ్రామాల రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వర్షాల వల్ల జొన్నలు తడిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తేమ శాతం నిబంధన ఉండడంతో వర్షాల ధాటికి ఆరబెట్టడం కష్టంగా మారిందని తెలిపారు. తడిసిన ప్రతీ గింజను కొనుగోలు చేయాలని, జొన్నల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి కొనుగోలు తేదీని పొడగించాలని కోరారు.

సోనాల తహసీల్దార్‌గా ఇమ్రాన్‌ఖాన్ బాధ్యతల స్వీకరణ

సోనాల, మే 30(ఆంధ్రజ్యోతి): సోనాల మండల నూతన తహసీల్దార్‌గా ఇమ్రాన్‌ఖాన్ పఠాన్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. తాజాగా జరిగిన బదిలీల్లో భాగంగా మంచిర్యాల జిల్లా నుంచి సోనాలకు బదిలీపై వచ్చారు. గతంలో బోథ్ మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. అనంతరం ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతించారు. ఇక్కడ పని చేస్తున్న మల్లేష్ తిరిగి బోథ్ మండల డిప్యూటీ తహసీల్దార్‌గా వెళ్లనున్నారు.



తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఇమ్రాన్‌ఖాన్



తొలకరికి ముందే.. సాగు సందడి!

- జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు
- ఊపందుకుంటున్న వానాకాలం సీజన్ పంటల సాగు పనులు
- మద్దతు ధర భారీగా పెరగడంతో పత్తి పంట వైపే పరుగులు
- సాగు పనులతో బిజీబిజీగా అన్నదాతలు
- జిల్లావ్యాప్తంగా ఈయేడు 5.85 లక్షలకు పైగా సాధారణ సాగు విస్తీర్ణం

ఆదిలాబాద్, మే 30(ఆంధ్రజ్యోతి): ఈ యేడు తొలకరికి ముందే జిల్లాలో సాగు సందడి కనిపిస్తుంది. ఇంకా నైరుతి రుతుపవనాలు పూర్తిస్థాయిలో రాక ముందే అన్నదాతలు పంటల సాగుకు శ్రీకారం చుడుతున్నారు. గత వారం రోజులుగా జిల్లాలో ఓ మోస్తారు స్థాయి నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. మునుపెన్నడూ లేని విధంగా మే చివరి మాసంలోనే భారీ వర్షాలు కురవడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే కొన్నిచోట్ల జొన్న పంట కొనుగోళ్లు పూర్తికాక పోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లాలో ప్రధానంగా వానాకాలం సీజన్‌లో పత్తి, సోయా, కంది పంటలను సాగు చేస్తారు. అయితే నేలలో సరైన తేమ శాతం ఉంటేనే పంటలను సాగు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ యేడు జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 5లక్షల 85వేల 350 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 10శాతం పంటల సాగు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే పంటలను వేసేందుకు సరిపడా తేమ ఉన్నా.. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సాగు పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదంటున్నారు. అయినా రైతులు పత్తి, సోయా, కంది పంటలను సాగు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతలు పంటల సాగు పనుల్లో బిజీబిజీగా కనిపిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కుటుంబ సమేతంగా సాగు పనుల్లోనే నిమగ్నమవుతున్నారు. పంటల సాగు పనులు ప్రారంభం కావడంతో గ్రామాల్లో కూలీలకు భారీ డిమాండ్ ఏర్పడుతుంది.



జిల్లాలో పత్తి విత్తనాలను విత్తుతున్న మహిళా రైతులు

ఆరుతడి పంటలే అధికం

జిల్లాలో సాగునీటి వనరులు అంతంత మాత్రంగానే ఉండడంతో రైతులు ఎక్కువగా వర్షాధారంగా పండించే ఆరుతడి పంటలనే ఎక్కువగా సాగు చేస్తున్నారు. జిల్లాలో ఎక్కువగా విస్తరించి ఉన్న నల్లరేగడి నేలల్లో తేమ ఎక్కువగానే ఉంటుంది. ఒకసారి వర్షం కురిసిన తర్వాత వారం రోజుల పాటు నేలలో తేమ ఉంటుందని రైతులు చెబుతున్నారు. అయితే ఇప్పటివరకు జిల్లాలో 86.8 మి.మీ.ల వర్షపాతం నమోదైనట్లు అధికారుల లెక్కల ప్రకారం తెలుస్తుంది. విత్తనాలను విత్తుకునేందుకు నేలలో అనుకూలమైన తేమ ఉందని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో వర్షాధారంగా పండించే పత్తి, సోయా, కంది పంటలను మే 25 నుంచి జూన్ 2వ వారంలోగా విత్తుకుంటే చీడపీడలు ఆశించకుండా పంటలు ఏపుగా పెరిగే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా ఆలస్యంగా విత్తనాలను విత్తితే చీడపీడలు ఆశించి నష్టపోయే అవకాశం ఉందంటున్నారు. సరైన తేమలోనే విత్తనాలను వేసుకుంటే మొలక శాతం అధికంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. నకిలీ విత్తనాలు తప్ప అసలైన విత్తనాలను వేసిన ఐదు రోజుల్లోనే మొలకెత్తే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటికే వేసిన విత్తనాలు మొలకెత్తుతుండడంతో అన్నదాతలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

పత్తికి అధిక మద్దతు

పత్తి పంటకు ప్రభుత్వం అధిక మద్దతు ధరను ప్రకటించడంతో అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతోంది. దీంతో పత్తి పంటనే సాగు చేసేందుకు రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో అధికంగా సాగయ్యే పత్తి పంట మద్ధతు ధర క్వింటాల్ రూ.8110లుగా ప్రభుత్వం నిర్ణయించింది. గత రెండు మూడేళ్లుగా పత్తి పంటకు మద్ధతు ధర దక్కడంతో రైతుల ఇళ్లలో సిరులు కురిపించింది. అలాగే చీడపీడలు, తెగుళ్లను తట్టుకునే బీటీ రకం విత్తనాలను రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. దీంతో దిగుబడులు కూడా ఆశాజనకం గానే కనిపిస్తున్నాయి. ప్రతియేటా మార్కెట్లోకి కొత్త రకం బీటీ విత్తనాలు అందుబాటులోకి రావడంతో విత్తన మార్పిడి చేస్తూ పత్తి పంటను సాగు చేస్తున్నారు. గతేడు 4లక్షల 34వేల ఎకరాలలో పత్తి పంట సాగు కాగా, ఈ సారి

(తరువాయి 6వ పేజీలో...)




విత్తనాలను సిద్ధం చేసుకుంటూ..

ఫిర్యాదుదారులతో బాధ్యతగా వ్యవహరించాలి

● అధికారులతో నెలవారీ సమీక్షలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్ అర్బన్, మే 30(ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ కేసుల నమోదులో ఎలాంటి జాప్యం వహించకుండా ఉండాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ సూచించారు. శుక్రవారం జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లోని సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అధ్యక్షతన ఆదిలాబాద్ సబ్ డివిజనల్ అధికారులతో నెలవారీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసుల నమోదులో ఎలాంటి జాప్యం వహించరాదన్నారు. ప్రతీఒక్క కేసు దర్యాప్తు వివరాలను సంబంధిత పోలీసు అధికారులకు అడిగి క్షుణంగా పరిశీలించారు. రానున్నది వర్షాకాలమని, జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తమై ఉండాలని సూచించారు. పోలీసు వాహనాలలో అత్యవసర సామగ్రిని కలిగి ఉండాలని, వాగులు వంకలు బ్రిడ్జిలను దాటి ప్రవహిస్తున్నప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. అదేవిధంగా రైతులు మోసపోకుండా నకిలీ విత్తనాలను చలామణిలో లేకుండా కఠినమైన చర్యలను తీసుకోవాలని పేర్కొన్నారు. రైతులు నాణ్యమైన విత్తనాలను గుర్తింపు పొందిన దుకాణ యజమానుల వద్ద పొందాలని, ప్యాకెట్లపై సరైన లేబుల్, విత్తనం తయారీ తేదీ, ఎక్స్‌పైరీ తేదీ పూర్తి వివరాలను కలిగి ఉండి దుకాణయజమాని వద్ద బిల్లు గ్రహించాలని సూచించారు. రానున్న బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లావ్యాప్తంగా అక్రమ పశువుల రవాణా జరగకుండా చూడాలని, ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేస్తూ ఉండాలని తెలిపారు. సరైన పత్రాలు, అనుమతులు లేకుండా పశువుల రవాణా జరుగకుండా ఆపాలన్నారు. డయల్ 100, బ్లూకోర్ట్ సిబ్బంది గ్రామ గ్రామాన సందర్శిస్తూ పోలీసులు మీ కోసం కార్యక్రమాలను నిర్వహిస్తూ, విలేజ్ పోలీసు ఆఫీసర్ ఆవశ్యకతపై వివరించాలన్నారు. ఎలాంటి సమాచరమైన డయల్ 100 లేదా వీపీవోకు సంప్రదించాలని తెలిపారు. రానున్న లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అవగాహణ కల్పించాలన్నారు. పెండింగ్ కేసులను పరిష్కరించే దిశగా కృషి చేయాలని తెలిపారు. ఇందులో అదనపు ఎస్పీ బి.సురేందర్‌రావు, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, స్వామి, సీఐలు బి.సునిల్ కుమార్, సీహెచ్ కరుణాకర్‌రావు, కె.ఫణిదర్, ఎ.వెంకటేశ్వరరావు, పండేరావు, గుణవంత్‌రావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు డి.వెంకటి, టి.మురళి, ఎన్.చంద్రశేఖర్, బి శ్రీపాల్, ఆదిలాబాద్ సబ్ డివిజన్ ఎస్సైలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న జిల్లా ఎస్పీ



శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ కాజల్‌సింగ్

మత సామరస్యానికి ప్రతీకగా.. బక్రీద్ నిర్వహించాలి : ఉట్నూర్ ఏఎస్పీ

ఇచ్చోడ, మే 30(ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ప్రతీకగా బ్రకీద్ పండగను నిర్వహించాలని, అందుకు అన్ని వర్గాల ప్రజలు పరస్పరం సహకారం అందించాలని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ పేర్కొన్నారు. బక్రీద్ సందర్భంగా శుక్రవారం ఇచ్చోడ సర్కిల్ కార్యాలయ ఆవరణలో జరిగిన శాంతికమిటీ సమావేశానికి హాజరై ప్రసంగించారు. అంతకుముందు ఇచ్చోడ సర్కిల్ పరిధిలోని దాబా హోటళ్ల యాజమానులతో సమావేశం నిర్వహించారు. ఇచ్చోడ, గుడిహత్నూర్, నేరడిగొండ మండలాల్లో ఉన్న ప్రతీఒక్క దాబా హోటళ్లలో సీసీ కామెరాలు ఉండాలని, అవి కూడా పని చేయాలన్నారు. దాబాలల్లో మద్యం విక్రయించడం, సిట్టింగ్ ఉంచడంలాంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దాబాల పరిధిలో పేకాట ఆడుతున్నారని, ఆడటానికి సహకరించే వారిపై చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ బండారి రాజు, ఎస్సైలు శ్రీకాంత్, పురుషోత్తం, సంజయ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతులు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలి

తలమడుగు, మే 30(ఆంధ్రజ్యోతి): దుకాణంలో విత్తనాలు కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రమోద్ రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని కుచ్లాపూర్, లింగి, సుంకిడి గ్రామాలలో గల సీడ్, ఫెర్టిలైజర్ దుకాణలో సీడ్ స్టాక్ వివరాలతో పాటువిత్తన స్టాక్ రిజిస్టర్, రశీదు పుస్తకాలను పరి శీలించారు. అలాగే మండలానికి దాదాపు 50 వేల పత్తి విత్తన పాకెట్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రైతు సంఘాలతోనే ఆర్థిక అభివృద్ధి

● ప్రజామిత్ర వార్షిక మహాసభలో త్రిలోచన శాస్త్రి

ఉట్నూర, మే 30(ఆంధ్రజ్యోతి): రైతు సంఘాలు ఏర్పాటు చేయడం ద్వారానే రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని సీసీడీ సంస్థ వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ త్రిలోచన శాస్త్రి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రజామిత్ర సమాఖ్య 18వ వార్షిక మహాసభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే తప్పనిసరిగా రైతు సంఘాలు ఏర్పాటు చేయడం ఒకటే మార్గమని, వీటి ద్వారా రైతులు వారు పండించే పంటలు అమ్మి లాభాలు పొందవచ్చు అన్నారు. ఇందుకు తమ పంట ఉత్పత్తులను తప్పనిసరిగా విలువ ఆధారితంగా మార్చి అమ్మితేనే లాభాలు పొందవచ్చు అన్నారు. ఈ సందర్భంగా ప్రజామిత్ర నూతన పాలక వర్గంను సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సిడం గంగాధర్, జనరల్ మేనేజర్‌గా సోయం జుగాది రావు, ఉపాధ్యక్షుడిగా కుమర కేశవలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల నుంచి రైతు సంఘాల సభ్యులు హాజర య్యారు. సీసీడీ సంస్థ ప్రాజెక్టు మేనేజర్‌లు కుంర విఠల్‌రావు, రాథోడ్ శేషారావు, సిబ్బంది మానాల లక్ష్మీనారాయణ, రామిని ప్రశాంత్, అస్లాం, శివరాజ్ మహేందర్, రైతులు గణపతి, సూర్యభాన్, తులసిరామ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ త్రిలోచన శాస్త్రి

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ● గిన్నేరా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం ● పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు

ఇంద్రవెల్లి, మే 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే నిరు పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకుంటామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని గిన్నేరా గ్రామంలో జిల్లాలో మొదటిసారిగా ఇందిరమ్మ ఇళ్ల రెండవ విడత కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షాతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాన్ని అందజేసి, ఇందిరమ్మ ఇంటికి ముగ్గుపోసి, నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు నిరుపేదలందరికీ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవడం ఖాయమని, ఈ విషయంలో ఆందోళన చెందరాదని కోరారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్, డీఆర్డీవో పీడీ, మండల ప్రత్యేకాధికారి రాథోడ్ రవీందర్, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో జీవన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



● గిన్నేరాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కలెక్టర్ రాజర్షిషా

● ప్రజలు సంఘటితం కావాలి : ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్: నాలుగు, ఐదు దశాబ్దాలుగా పోడు వ్యవసాయం చేస్తూ జీవిస్తున్న రైతుల భూములను హక్కు పత్రాలు లేవన్న సాకుతో అటవీ శాఖ అధికారులు భూములలో మొక్కలు పెంచడానికి ప్రయత్నిస్తే ప్రజలు సంఘటితం కావాలని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని హీరాపూర్(పి) గ్రామంలో గిరిజనులకు మంజూరైన 11 ఇందిరమ్మ ఇళ్ల పనులను ప్రారంభించిన సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత దశాబ్దం కాలం బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ఎలాంటి ఇబ్బందులకు పాల్పడని అటవీ శాఖ అధికారులు.. ప్రస్తుతం పోడు భూముల్లో అలజడులు సృష్టించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్‌నాం చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. గిరిజనులకు ఎవరు ఇలాంటి సమస్యలు వచ్చినా తనను సంప్రదించాలని కోరారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఉన్నతాధికారుల సమావేశంలో కూడా ఈ విషయం ప్రస్తావించడం జరిగిందన్నారు. ప్రజలు తిరగబడితే అధికారులు బాధ్యత వహించాల్సి వస్తుందని చెప్పడం జరిగిందన్నారు. పోడు భూముల్లో త్రిఫేజ్‌కరెంట్ సౌకర్యం కల్పించకుండా అడ్డుకోవడంతో ప్రభుత్వం బోర్లు వేసి సోలార్ పంపులు ఏర్పాటు చేసి సాగునీరు అందించడానికి ఒక్కొక్క యూనిట్‌కు రూ.ఆరు లక్షలు కేటాయిస్తుందన్నారు. అర్హులైన రైతులకు రైతుబంధు పథకం అమలు చేస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. అలాగే, గ్రామీణ ప్రాంతాలలో రోడ్ల నిర్మాణానికి కూడా అటవి శాఖ ఇబ్బందులు పడుతుందని ఆయన వివరించారు.



హీరాపూర్(పి)లో పనులను ప్రారంభిస్తూ..

● ఐటీడీఏ స్థాయిలో 22వేల ఇందిరమ్మ ఇళ్లు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఖానాపూర్ నియోజకవర్గానికి సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నారని ఉట్నూర్ ఐటీడీఏకి గిరిజనులకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించడానికి 22016 గృహాలు మంజూరు అయ్యాయని, అదేవిధంగా జనరల్ కేటగిరి కింద 3500 గృహాలు మంజూరు అయ్యాయన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లోని గిరిజనులకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించడానికి 3వేలకు పైగా గృహాలు మంజూరు అవుతాయని అన్నారు. తమకు ఇల్లు మంజూరు కాలేదని ఎవరు కూడా అసంతృప్తికి లోను కావద్దని, త్వరలోనే అందరికి ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాంప్రసాద్, ఎంపీవో సుధీర్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీవో రజనికాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సచిన్, గృహ నిర్మాణ శాఖ ఏఈ వంశీ, మాజీ ఎంపీటీసీ చిత్రుపటేల్, మాజీ సర్పంచ్ రాధామారుతి, ఆర్టీఏ సభ్యులు దూట రాజేశ్వర్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య, పార్టీ మండల అధ్యక్షుడు ఖయ్యుం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎక్బాల్, రాజేశ్ నాయక్, భాగ్యలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.